క్లుప్తంగా

విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ పంపిణీ



విద్యార్థులకు పంపిణీ చేస్తున్న పరీక్ష కిట్స్

చినకోండ్రుపాడు(ప్రత్తిపాడు): మండల పరిధిలోని చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్స్ పంపిణీ చేశారు. విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ జన్మదినం సందర్భంగా విశ్వమానవ సమైక్యతా సంసత్ సహకారంతో గ్రామానికి చెందిన పాఠశాల పూర్వ విద్యార్థి పోతురాజు లక్ష్మీనారాయణ 72 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్, పెన్, జామెట్రీ బాక్స్, స్కెచ్ పెన్స్ సెట్.. ఇలాపది రకాల వస్తువులతో కూడిన కిట్ అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కేవీ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ పెట్టాలి

కోతివానిపాలెం(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని కోతివానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈఓ తనిఖీ చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు

ప్రత్తిపాడు: వివాహిత అదృశ్యంపై ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. వివరాలు.. ప్రత్తిపాడుకు చెందిన పల్లం శాంత కుమారి, జక్రయ్య దంపతులు. గత కొంత కాలంగా స్థానికంగా నివాసం ఉంటున్నారు. గత నెల 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. బంధువుల ఇళ్లల్లో, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆమె భర్త పల్లం జక్రయ్య శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్‌ఐ ఆరోగ్యరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దౌర్జన్యం చేసిన వ్యక్తులపై కేసు

పెదకాకాని: స్థల వివాదంలో మహిళపై దౌర్జన్యానికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని స్వర్ణపురికాలనీలో చంద్రశేఖర్ అనే వ్యక్తికి ఇంటి స్థలం ఉంది. పక్కనే అమృతపూడి కరుణకుమారి అనే మహిళ నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తోంది. ప్రస్తుతం ఆ ఇల్లు శిథిలావస్థకు చేరడంతో ఆమె గుంటూరులో అద్దె ఇంట్లో ఉంటోంది. ఆ స్థలంలో ఉన్న ఇంటి రాళ్లను తొలగించిన మెరక తోలుతున్నారని స్థానికులు ఆమెకు ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకుంది. ఆ మహిళ నివాసం ఉంటున్న స్థలం చంద్రశేఖర్‌కు చెందినదేనని ఖాళీ చేయాలని బెదిరించడంతో స్థలానికి సంబంధించిన దస్తావేజులు తీసుకురావాలని కరుణకుమారి వారిని కోరింది. దస్తావేజులు తీసుకు రాకపోగా ఎస్‌వీ సాంబశివరావు, కె. రామారావులతో పాటు మరొక వ్యక్తి బెదిరింపులకు పాల్పడటంతో పాటు కులంపేరుతో అసభ్యంగా దూషించడం, అనంతరం చేతిలో ఫోన్ లాక్కుని వెళ్లిపోయారు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు కరుణకుమారి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మహిళ కావడంతో ఈ కేసులో అదే సామాజిక వర్గానికి చెందిన వారిని మినహాయించి మిగిలిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు శనివారం పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

పెట్రోల్ బంకు పంప్ బాయ్‌పై కేసు

ప్రత్తిపాడు: పెట్రోల్ బంకులో పంప్ బాయ్‌గా చేస్తున్న వ్యక్తిపై ప్రత్తిపాడు పోలీసు స్టేషన్ లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక గుంటూరు – పర్చూరు రోడ్డులోని శ్రీ సాయి షణ్ముఖ సీతారామ ఫిల్లింగ్ స్టేషన్‌లో అదే గ్రామానికి చెందిన తుపాకుల రాధాకృష్ణమూర్తి పంప్ బాయ్ గా పని చేస్తున్నాడు. గత నెల 11వ తేదీన బంకులో ఆయిల్ విక్రయించగా వచ్చిన సుమారు రూ. 1,10,000 రూపాయల నగదును బంకు యాజమాన్యానికి అప్పగించకుండా, ఎవ్వరికీ చెప్పకుండా రాధాకృష్ణ మూర్తి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఎదురుచూసిన అతను తిరిగి రాలేదు. దీంతో బంకు మేనేజర్ మాధవరపు శ్రీను శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్‌ఐ ఆరోగ్యరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచాలలో వరి గడ్డివామి దగ్ధం

మంచాల(చేబ్రోలు): అగ్ని ప్రమాదంలో ఐదు ఎకరాల పశుగ్రాసం దగ్ధమవటంతో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మేకల వెంకట్రావుకు చెందిన ఐదు ఎకరాల పశుగ్రాసాన్ని వేణుగోపాలస్వామి దేవాలయం సమీపంలో నిల్వ చేశాడు. ఈ వరి గడ్డివామి రాత్రి సమయంలో ఆకస్మికంగా మంటలు వ్యాపించి పూర్తిగా కాలి బూడిదైంది. పొన్నూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సమీపంలోనే మరి కొన్ని గడ్డివాములు, పూరిల్లు ఉండటంతో స్థానికులు భయాందోళన చెందారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సమాచారం తెలుసుకుని ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు.

లవ్ యూ రామ్ బృందం సందడి

వీవీఐటీ కళాశాలలో లవ్ యూ రామ్ చిత్ర బృందం సందడి చేసింది. పెదకాకాని మండలం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలను శనివారం లవ్ యూ రామ్ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో చిత్ర ప్రచారంలో సందర్శించింది. ప్రముఖ దర్శకుడు కె.దశరథ్ అందించిన కథతో రోహిత్ బెహల్ హీరోగా అపర్ణ జనార్దన్ హీరోయిన్‌గా డీవీ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం లవ్ యూ రామ్ చిత్రంలోని ఉండాలని ఉంది అను పాటను కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. డైరెక్టర్ డీవీ చౌదరి మాట్లాడుతూ ఈ చిత్ర ట్రైలర్‌కి ఇప్పటికే మంచి స్పందన లభించిందన్నారు. చిత్రాన్ని సందేశాత్మక ప్రేమకథా చిత్రంగా రూపొందించామన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా చిత్ర బృందంతో కలసి విద్యార్థులు నృత్యాలు, గీతాలు, సెల్ఫీలతో సందడి చేశారు. చిత్రంలోని గీతాలను ఇన్‌స్టాగామ్ రీల్స్‌ను చిత్రీకరించి సామాజిక మాధ్యమాలలో పోస్టు చేశారు. కార్యక్రమంలో హీరో రోహిత్ బెహల్, హీరోయిన్ అపర్ణ జనార్దన్, దర్శకుడు డీవీ చౌదరి, నిర్మాతలు దశరథ్, సంగీత దర్శకుడు కె.వేద పాల్గొన్నారు. –పెదకాకాని



నంబూరు వీవీఐటీలో లవ్ యూ రామ్ చిత్ర బృందంతో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

అవ్వారు ఆదెమ్మ చిరస్మరణీయురాలు

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు(చేబ్రోలు): పేదలకు, బాటసారులకు అవ్వారు ఆదెమ్మ పేరిట అందిస్తున్న సేవలు అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరులో అవ్వారు ఆదెమ్మ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు ఉపకార వేతనాలు, పేద బ్రాహ్మణులకు సంభావన, అన్న ప్రసాద వితరణ శనివారం నిర్వహించారు. అవ్వారు ఆదెమ్మ సత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ నిరుపేదలకు సత్రంలో నిత్య అన్నదానం చేయటం దాతల ఆశయం నెరవేరటంతో పాటు మానవత్వం కనపిస్తోందన్నారు. సత్రం ఆవరణలో కల్యాణ మండపం నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఫౌండర్ ట్రస్టు అవ్వారు వెంకటేశ్వరరావు, ఈఓ దుర్గా ప్రసాద్, రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా, బీపీఎల్ ప్రభాకర రావు పాల్గొన్నారు. జెడ్పీ హైస్కూల్, మున్సిపల్ హైస్కూల్, ఏఎస్ఎం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఉపకార వేతనాలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. పేద బ్రాహ్మణులకు సంభావన, అన్నసంతర్పణ చేశారు. పేద బ్రాహ్మణులకు నిత్యావసరాలు, నూతన వస్త్రాలు, నగదు పంపిణీ చేశారు.



విద్యార్థినికి నగదు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- మంచాలలో గడప గడపకు మన ప్రభుత్వం

మంచాల(చేబ్రోలు): గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తెలిపారు. మండలంలోని మంచాల గ్రామంలో రెండో రోజు శనివారం ఎస్టీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రతి కుటుంబానికి అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. మంచాలలో రూ.8.31కోట్లు సంక్షేమ పథకాల ద్వారా అందించినట్లు వెల్లడించారు. రూ.20 లక్షలతో సైడ్ కాలువల నిర్మాణం, డొంక రోడ్లును అభివృద్ధి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.సాహితి, జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, గ్రామ సర్పంచి చందు వెంకట సాంబశివరావు, ఎంపీటీసీ తిరువీధుల అంజనాదేవి, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, మండలనేని శ్రీనివాసరావు, జి.అంకమ్మరావు, అన్నదాసు సుబ్బారావు, వెంకట సుబ్బయ్య, ప్రసాద్, ఎంపీడీఓ బాబూరావు, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వృద్ధురాలికి అందిన లబ్ధిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

ఆర్థిక సహాయం అందజేత

మంచాల(చేబ్రోలు): అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. మేకల వెంకట్రావుకు చెందిన ఐదు ఎకరాల వరిగడ్డి వామి దగ్ధం కాగా శనివారం ఎమ్మెల్యే వారి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.40వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఔషధాల భద్రతకు ఫార్మాకో విజిలెన్స్‌తో ముందడుగు

ఫార్మకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ శంకర్

గుంటూరు రూరల్: ఔషధాల భద్రతకు ఫార్మాకో విజిలెన్స్ ద్వారా ముందడుగు వేయనున్నట్లు గుంటూరు మెడికల్ కళాశాల ఫార్మకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.శంకర్ తెలిపారు. నగర శివారుల్లోని లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ఫార్మాకో విజిలెన్స్ హీమోవిజిలెన్స్, పెటీరియా విజిలెన్స్ అనే శీర్షికతో వర్క్‌షాపు శనివారం నిర్వహించారు. ప్రొఫెసర్ శంకర్ మాట్లాడుతూ ఔషధం జీవిత చక్రంలో భద్రత, సమర్థత అనేవి ముఖ్యమైనవిగా పేర్కొన్నారు. నూతన వ్యాధుల చికిత్స పద్ధతుల్లో ఔషధ ప్రభావాలు పర్యవేక్షించేందుకు మందుల సమాచారాన్ని సేకరించటం, విశ్లేషించటం ప్రతి కూల చర్యలను నివారించటం ఫార్మాకో విజిలెన్స్ ముఖ్య పాత్ర పోషిస్తుందని వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చంద్రకళ మాట్లాడుతూ ఫార్మాకో విజిలెన్స్ అనేది ఔషధ భద్రతలో అంతర్భాగమని అనేక వ్యాధుల నివారణకు సంబంధించిన అధ్యయనంలో జరిగే ప్రతి కూల ఘటనలను ఎదుర్కొటానికి వ్యాధి చికిత్సా పరిశోధనలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ భద్రతా పరమైన అంశాలను దృష్టిలో ఉంచుకుని ఉన్నత ప్రమాణాలను పరిపూర్ణమైన ఔషధాన్ని విపణిలోకి తీసుకురావటానికి ఈ ఫార్మాకో విజిలెన్స్ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. డాక్టర్ కె.తేజోమూర్తి మాట్లాడుతూ రక్తం నుంచి సేకరించిన మూలకాలను చికిత్స నిమిత్తం రోగులకు మార్పిడి చేసే విధానాలను పర్యవేక్షించటం హీమో విజిలెన్స్ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు, చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అతిథులను ఘనంగా సన్మానించారు.



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

65 మందికి ఒక్కరూ హాజరవ్వరా

- వలంటీర్లుకు కనీస బాధ్యత లేదా
- డీపీవో ఆర్ కేశవరెడ్డి

ప్రత్తిపాడు: వలంటీర్లకు కనీస బాధ్యత లేదా.. అంటూ జిల్లా పంచాయతీ అధికారి ఆర్ కేశవరెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో హౌసింగ్ డే శనివారం నిర్వహించారు. స్థానిక జగనన్న హౌసింగ్ లే అవుట్‌లో గృహ లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమంతో పాటు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ కేశవరెడ్డి సహా ఎంపీడీఓ, తహసీల్దార్.. హౌసింగ్ ఏఈ, పీఆర్, వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు అంతా సమావేశానికి హాజరయ్యారు. కానీ ప్రత్తిపాడు పంచాయతీలోని వలంటీర్లు ఒక్కరంటే ఒక్కరూ కూడా హాజరు కాలేదు. మొత్తం మూడు సచివాలయాల పరిధిలో 65 మంది ఉండగా ఏ ఒక్కరూ మీటింగ్ కు రాకపోవడంతో డీపీఓ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వలంటీర్లు పింఛను పంచడం ఒక్కటే బాధ్యత అనుకుంటే కుదరదని, ప్రజా సంక్షేమం, అభివృద్ధిలోనూ వలంటీర్ల బాధ్యత ఎంతో ఉందన్నారు. ఎంపీడీవో శ్రీరమ్య, వలంటీర్ల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫోన్లు మీద ఫోన్లు చేస్తే చివరకు ఐదారుగురు వాలంటీర్లు సమావేశానికి హాజరయ్యారు. ఇప్పటి వరకు గృహ నిర్మాణాలు మొదలు మొదలు పెట్టని వారు, మొదలు పెట్టి నిర్మాణం పూర్తి కానీ వారు ఉగాది నాటికి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా పంచాయతీ అధికారి ఆర్ కేశవరెడ్డి ఆదేశించారు.



సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి ఆర్ కేశవరెడ్డి, ఎంపీడీఓ శ్రీరమ్య తదితరులు

ఆయుర్వేదం భారతీయుల జీవన నాదం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యుగంధర్, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మహేశ్వరరెడ్డి

పాత గుంటూరు: మన సంస్కృతి సాంప్రదాయాల్లో భాగమైన ప్రాచీన ఆయుర్వేదం భారతీయుల జీవన విధానంలో భాగమైందని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. శనివారం బ్రాడిపేటలోని ఓ హోటల్‌లో ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ బృందావనం రాధాకృష్ణమూర్తి రచించిన ఆయుర్వేద చికిత్సా పుస్తకాన్ని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ మహేశ్వర రెడ్డి, యుగంధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ అల్లోపతి వైద్యం అభివృద్ధి చెందినప్పటికి ఆయుర్వేదానికి ప్రత్యేక స్థానముందని చెప్పారు. అనంతరం డాక్టర్ రాధా కృష్ణమూర్తి, సామ్రాజ్యం దంపతుల్ని ఘనంగా సత్కరించారు. సమావేశానికి హిందూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ దీక్షితులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డాక్టర్ దీవి హరిప్రసాద్, జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి, సిరిపురపు శ్రీధర్, రొంపిచర్ల శేషాచార్యులు, డాక్టర్ బృందావనం రాజేష్, మేడూరి శ్రీనివాసమూర్తి, డాక్టర్ నారాయణం వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా కళ్లం ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం

గుంటూరు రూరల్: ప్రస్తుత ఆధునిక సాకేతిక విద్యా రంగంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు అపరిమిత ఉద్యోగ అవకాశాలున్నాయని కాకినాడ జేఎన్‌టీయూ విద్యాప్రణాళిక డైరెక్టర్ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ తెలిపారు. నగర శివారుల్లోని చౌడవరంలోని కళాశాల 12వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి ఉన్నత లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ గత విద్యాసంవత్సరంలో తమ విద్యార్థులు చూపిన ప్రతిభ వార్షిక నివేదికను వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను రూ.20 లక్షలకు పైగా అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రంమలో అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కళాశాల చైర్మన్ కళ్లం మోహనరెడ్డి, వైస్ చైర్మన్ పి.వెంకటేశ్వర రెడ్డి, ఏఓ కళ్లం నవ్య, ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు పాల్గొన్నారు.



విద్యార్థుల నృత్య ప్రదర్శన

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

డీఆర్‌సీ డీపీడీ రామాంజనేయులు

పెదకాకాని: రైతులు తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ రామాంజనేయులు అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరులో శనివారం మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులకు పొలంబడి కార్యక్రమం ఏర్పాటు చేశారు. సమావేశానికి మండల వ్యవసాయాధికారి పి.సంధ్యారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ కాలపరిమితి అయిన పంటలో విచక్షణా రహితంగా పురుగుమందులు వాడటం ద్వారా పెట్టుబడులు పెరగడంతో పాటు పర్యావరణానికి కూడా ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. పెసర పంట పూత దశలో సీతాఫలం తెగులు ఆశించినట్లు గుర్తించడం జరిగిందన్నారు. అలానే జొన్న పంటలో గులాబి రంగు మొవ్వ తొలుచు పురుగును గమనించడం జరిగిందన్నారు. ఈ పురుగు నివారణకు పిచికారి చేయాల్సిన మందులను వివరించారు. వేసవికాలంలో ప్రతి రైతు మట్టి నమూనాలను పరీక్షలకు పంపి వాటి నివేదిక ఆధారంగా పంటలు వేసుకోవడం, ఎరువులు వేయడం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఏఏటీటీసీ సెంటర్ శాస్త్రవేత్తలు డాక్టర్ కిషోర్, డాక్టర్ శ్రీలతావాణి, డాక్టర్ నగేష్ పాల్గొన్నారు.



నంబూరు శివార్లలో పెసర పైరను పరిశీలిస్తున్న డీఆర్‌సీ డీపీడీ రామాంజనేయులు

నేటి నుంచి అగస్త్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయ కల్యాణ మహోత్సవాలను ఆదివారం నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జొన్నకూటి సాయి విశ్వనాథం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు తుర్లపాటి ప్రసన్నాంజనేయశర్మ, చదలవాడ ప్రసన్నకుమార్ నేతృత్వంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నారు. 6న స్వామి కల్యాణ మహోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎదురుకోల ఉత్సవం, 7న స్వామికి ప్రత్యేక అభిషేకాలతో పాటుగా స్వామివారి తలంబ్రాల సేవ, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 8వ తేదీన ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, పూర్ణాహుతి, ధ్వజారోహణం జరుగుతుందన్నారు.

శంకర కంటి ఆస్పత్రి సేవలు ప్రశంసనీయం

పెదకాకాని: అంధత్వ నివారణకు శంకర కంటి ఆస్పత్రి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జన చైతన్య సంస్థల డైరెక్టర్ మాదల రత్నగిరి బాబు తెలిపారు. పెదకాకానిలోని శంకర కంటి ఆస్పత్రిలో శనివారం రాత్రి జరిగిన 19వ వార్షికోత్స వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రత్నగిరి బాబు మాట్లాడుతూ కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ జయేంద్ర సరస్వతి స్వామి వారి కోరిక మేరకు పెదకాకానిలో ఈ ఆస్పత్రి నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. డాక్టర్ ఆర్‌వీ రమణి మాట్లాడుతూ 1977లో మొట్టమొదటిసారిగా కోయంబత్తూర్‌లో కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంధత్వ నివారణకు ఆసుపత్రి నిర్మాణం జరిగిందన్నారు. ఇప్పుడు దేశ వ్యాప్తంగా 12 ఆస్పత్రులు స్థాపించి, వేలాది మందికి చూపు ప్రసాదించడం ఎంతో గొప్ప వరం భావిస్తున్నామన్నారు. అనంతరం హాస్పిటల్ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన ఆటపాటలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కార్యక్రమంలో సీఈఓ డాక్టర్ సుధాకర్ పొట్టి, భరత్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వల చేస్తున్న డాక్టర్ ఆర్‌వీ రమణి, పక్కన రత్నగిరి బాబు, డాక్టర్ సుధాకర్

నగరంలో ఎస్పీ తనిఖీలు

నగరంపాలెం: గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ఏరియాల్లో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ శుక్రవారం రాత్రి ఆకస్మికంగా పర్యటించారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారు జాము వరకు కోబాల్డుపేట, బ్రాడిపేట, లక్ష్మీపురం ప్రధాన వీధులతోపాటు గల్లీలోనూ కాలినడకన తనిఖీలు చేశారు. రాత్రి వేళ పలు పాయింట్లల్లో విధులు నిర్వర్తించే పోలీస్ సిబ్బందితో వైర్‌లెస్ సెట్‌లో ఎస్పీ మాట్లాడారు. ఏ పాయింట్‌లో ఎక్కడున్నారు, ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు చెప్పిన వివరాలకు, చార్ట్‌ను సరిచూసుకున్నారు. కొద్దిసేపటి తరువాత వారు చెప్పిన పాయింట్‌లో ఉన్నారా లేదా అనేది పరిశీలించారు. ఏ ఒక్కరూ కూడా విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని స్పష్టం చేశారు. గుంటూరు నగర వీధుల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా రాత్రివేళల్లో ఇన్‌చార్జి పర్యవేక్షణలో విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. అర్ధరాత్రుళ్లు ఎవరైనా అనుమానిత వ్యక్తులు తారసపడితే అదుపులోకి తీసుకోవాలని కోరారు. ఎస్పీ వెంట పశ్చిమ ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసరావు, పట్టాభిపురం సీఐ రాజశేఖరరెడ్డి, ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు ఉన్నారు.



కానిస్టేబుల్‌తో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, పక్కన సీఐ రాజశేఖరరెడ్డి, ఎస్‌ఐలు

కనుల పండువగా సంతానలక్ష్మీ కల్యాణం

పాత గుంటూరు: అరండల్‌పేట 4వ లైనులోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీ నారాయణస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సంతానలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు.

వర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: చిన్ననాటి స్నేహాలు కొనసాగించేందుకు పూర్వ విద్యార్థుల సంఘం వేదిక అని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ సమావేశం శనివారం యూనివర్సిటీలో నిర్వహించారు.. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ చదువులు పూర్తి అయిన తరువాత వివిధ ప్రాంతాలలో, వృత్తుల్లో స్థిరపడిన వారు ఒక వేదికపైకి రావడం అభినందనీయమని చెప్పారు. పూర్వ విద్యార్థులు తమ కుటుంబంతోపాటు తాము చదివిన యూనివర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. జీవితంలో డబ్బులు సంపాదించడం ఎంతో ముఖ్యమని కానీ దానితో పాటు కుటుంబం వ్యవస్థ, మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని గుర్తించాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులు ఇప్పుడు చదువుకుంటున్న విద్యార్థులకు పలు రకాలుగా సహకారం అందించాలని సూచించారు. సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జీవితంలో ఓ మధురానుభూతి అన్నారు. ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కో ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ సృజని, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.ప్రమీలారాణి, పూర్వ విద్యార్థులు, హెటిరో డ్రగ్స్ డెప్యూటీ మేనేజర్ డాక్టర్ వీఎస్ఎన్ మూర్తి, స్టాండర్డ్ చార్టడ్ బ్యాంక్ రిలేషన్ షిప్ మేనేజర్ సాయిరాం, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ సైంటిస్ట్ తేజేష్ వర్మ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య పి రాజశేఖర్, వేదికపై రిజిస్ట్రార్ ఆచార్య కరుణ తదితరులు

18న ఏఎన్‌యూలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో ఈనెల 18న ఎంకాం, ఎంబీఏ 1978–80, 1979–81 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థి, విశ్రాంత ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ తెలగరెడ్డి సత్యానందం తెలిపారు. శనివారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎం ప్రసాద్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా సత్యానందం మాట్లాడుతూ ఆయా బ్యాచ్‌లకు చెందిన ఎంకాం, ఎంబీఏ పూర్వ విద్యార్థులందరూ 42 ఏళ్ల తరువాత తొలిసారిగా కలుసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.కనకదుర్గ, వై.వెంకటేశ్వర్లు, ఎల్‌వీ రావు, ఎస్.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీఎం ప్రసాద్, పూర్వ విద్యార్థులు

ఉల్లాసంగా బృందావన శ్రీనివాసుని హనుమత్ సేవ

పాత గుంటూరు: బృందావన శ్రీనివాసుని హనుమత్ వాహనం, గరుడ వాహనంపై తిరువీధులలో కనుల పండువగా నగరోత్సవం శనివారం నిర్వహించారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 24వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో తాళ్లాయపాలెం శైవక్షేత్రం శివస్వామి, పరశివానంద భారతీస్వామి పాల్గొన్నారు. కార్యక్రమానికి బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయ్‌బాబు, బొల్లేపల్లి సత్యనారాయణ, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కోశాధికారి లంకా సూర్యనారాయణ, వూటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, అచ్యుత రామయ్య పాల్గొన్నారు.

